JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 01-09-2025
Medchal - Malkajgiri । Monday 01-09-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 97 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 97 । Pages : 8 । ₹: 5

ఈ బ్యూటీ ఇప్పుడు సౌతిండియన్ క్రేజీ హీరోయిన్. తెలుగుతో పాటు తమిళ్ లో సినిమాలు చేసింది. సినిమాల సంగతి పక్కన పెడితే.. గత కొన్ని రోజులుగా ఈ ముద్దుగుమ్మ పేరు తెగ మార్మోగిపోతోంది. ఎందుకంటే త్వరలోనే ఈ అందాల తార తన బ్యాచిలర్ లైఫ్ కు బై బై చెప్పనుంది. పెళ్లితో తన జీవితంలో కొత్త ఆధ్యాయానికి శ్రీకారం చుట్టనుంది.. ఈ ముద్దుగుమ్మ మెడలో ఒక స్టార్ హీరో మూడు ముళ్లు వేయనున్నాడు. గత 15 ఏళ్లుగా వీరిద్దరి మధ్య స్నేహ బంధం ఉందట. దీంతో వీరి స్నేహ బంధం కాస్తా ప్రేమ బంధంగా మారిపోయింది. త్వరలో అది మూడు ముళ్ల బంధంగా మారిపోనుంది. యస్. ఈ క్యూటీ మరెవరో కాదు విశాల్ కు కాబోయే భార్య సాయి ధన్సిక. ఇది ఆమె టీనేజ్ ఫొటో. విశాల్ తో ఎంగేజ్ మెంట్ నేపథ్యంలో సాయి ధన్సిక ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో బాగా వైరలవుతున్నాయి.



## భారత పర్యటనను ట్రంప్ రద్దు చేసుకున్నారా..



✍ **జయభేరి, న్యూఢిల్లీ :**

క్వాడ్ సమావేశాల్లో పాల్గొనేందుకు భారత్ వస్తానని తొలుత చెప్పిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతం ఆ ప్లాన్‌ను పక్కన పెట్టేసినట్టు తెలుస్తోంది. ఈ మేరకు న్యూయార్క్ టైమ్స్ ఓ కథనాన్ని ప్రచురించింది.

అమెరికా, భారత్ మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో న్యూయార్క్ టైమ్స్ ఇటీవల ప్రచురించిన కథనాలు మరింత సంచలనంగా మారాయి. భారత్‌లో పర్యటించాలన్న ప్లాన్‌ను ట్రంప్ తాజాగా పక్కనపెట్టేసినట్టు న్యూయార్క్ టైమ్స్ వార్తాపత్రిక తన కథనంలో పేర్కొంది. సెప్టెంబర్‌డిసెంబర్ మధ్య కాలంలో క్వాడ్ సమావేశాల కోసం భారత్‌లో పర్యటిస్తానని ట్రంప్ గతంలో ప్రధాని మోదీకి చెప్పారట. ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈ ప్లాన్స్‌ను పక్కన పెట్టేశారట. అయితే, ఈ విషయమై అటు అమెరికా, ఇటు భారత్ స్పందించలేదు. అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ప్రతిష్టంభన నెలకొందని న్యూయార్క్ టైమ్స్ రాసుకొచ్చింది. డొనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీల సంబంధాలు కూడా తిరోగమనంలో ఉన్నాయని పేర్కొంది. భారత్, పాక్ మధ్య రాజీ కుదిర్చానన్న ట్రంప్ ప్రకటనతో వివాదం ముదిరిందని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. 'తనే రాజీ కుదుర్చానని ట్రంప్ పదే పదే చెప్పడం ప్రధాని నరేంద్ర మోదీకి కోపం తెప్పించింది. ట్రంప్ తీరుతో మోదీ సహనం నశిస్తోంది' అని తెలిపింది. ఇక కెనడాలో ఇటీవల జరిగిన జీ7 సమావేశాలకు అటు ట్రంప్ ఇటు ప్రధాని మోదీ ఇద్దరూ హాజరయ్యారు. ఆ సందర్భంగా ఇద్దరి మధ్య సమావేశం కూడా జరగాల్సి ఉంది. అయితే, ట్రంప్ అత్యవసరంగా అమెరికాకు వెనుదిరగాల్సి వచ్చింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీతో దాదాపు 35 నిమిషాల పాటు ఫోన్ కాల్‌లో మాట్లాడారట. ఈ సందర్భంగా భారత్‌పాక్ మధ్య మూడో దేశం మధ్యవర్తిత్వం అంగీకరించబోమని ప్రధాని మోదీ స్పష్టం చేసినట్టు తెలిసింది. నోబెల్ ప్రైజ్‌కు పాక్ తనను నామినేట్ చేస్తున్న విషయాన్ని కూడా ట్రంప్ ఆ కాల్‌లో పేర్కొన్నారని, భారత్ కూడా ఇదే చేయాలన్న పరోక్ష సూచన చేశారని న్యూయార్క్ టైమ్స్ రాసుకొచ్చింది. ఈ కారణంగా ఇరు నేతల మధ్య ఎడం పెరిగినట్టు తెలిపింది. ఈ ఫోన్ కాల్‌కు సంబంధించి అమెరికా ఇంతవరకూ స్పందించలేదు.

## 'ప్రతిభా సేతు' పోర్టల్ ప్రారంభించిన ప్రధాని మోదీ




✍ **జయభేరి, న్యూఢిల్లీ :**


యూపీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా 'ప్రతిభా సేతు' పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ పోర్టల్ ద్వారా సివిల్ సర్వెంట్ అభ్యర్థులకు అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు మన్‌కీ బాత్ 125వ ఎపిసోడ్‌లో ఈ పోర్టల్‌ను మోదీ ప్రారంభించారు. దేశంలోని కఠినమైన పరీక్షల్లో సివిల్ సర్వీసెస్ ఒకటి. ప్రతీయేటా ఎంతో మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాసినా చివరి నిమిషంలో అవకాశం కోల్పోయేవారు వేలల్లో ఉన్నారు. దీంతో ఎంతో సమయం, డబ్బు వృధా అవుతుంది. నిజాయతీగా కష్టపడుతున్న ఒక్కోసారి స్వల్ప తేడాతో సివిల్స్ తుది జాబితాలో చోటు దక్కించుకోలేక వెనుదిరుగుతున్నారు. ఇలాంటి వారి కోసం ప్రతిభా సేతు పోర్టల్‌ను ప్రవేశపెట్టినట్లు ప్రధాని మోదీ తెలిపారు.

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షల అన్ని దశలలో ఉత్తీర్ణత సాధించినా.. ఇంటర్వ్యూ ప్రక్రియ తర్వాత తుది మెరిట్ లిస్టులో పేరు లేని అభ్యర్థుల వివరాలు ఇకపై ఈ పోర్టల్‌లో ఉంచనున్నట్లు ప్రధాని వెల్లడించారు. ఆ వివరాలు ప్రైవేట్ కంపెనీలు తీసుకొని.. తమ సంస్థలలో వారికి ఉపాధి కల్పించేందుకు తీసుకువచ్చిన వ్యూహాత్మక పోర్టల్ ఇది. ఇందుకోసం UPSC ప్రతిభా సేతు పోర్టల్ డైనమిక్ డేటాబేస్‌గా పనిచేస్తుందన్నారు.

...మిగతాది 2 లో

2 లో

## ఉగ్రవాదానికి క్రిప్టో కరెన్సీ ఉపయోగిస్తున్న పాకిస్థాన్..



# CBIకి అప్పగించడం సముచితం

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణం – జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ కమిషన్ నివేదికపై శాసనసభలో సుదీర్ఘంగా చర్చించిన మీదట తదుపరి విచారణకు ఈ మొత్తం వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు.

✍ **జయభేరి, హైదరాబాద్ :**

"కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం, అవినీతి ఆరోపణలపై విచారణ కోసం తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను నియమించడం జరిగింది.దీనిపై విచారణ కమిషన్ తన నివేదికను జూలై 31, 2025 వ తేదీన ప్రభుత్వానికి సమర్పించింది. ఆగస్టు 4, 2025 వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశం ఆ నివేదికను ఆమోదించింది. తదుపరి చర్చ కోసం నివేదికను శాసనసభ ముందు ఉంచాలని నిర్ణయించింది. ఆ మేరకు ఈ అంశంపై శాసనసభలో చర్చ జరిగింది.

జస్టిస్ ఘోష్ కమిషన్ తన నివేదికలో క్రిమినల్ చర్యలకు అర్హమైన అనేక లోపాలు, అవకతవకలను గుర్తించింది. నిర్లక్ష్యం, దురుద్దేశం, ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను తొక్కిపెట్టడం, ఆర్థిక అవకతవకల వంటి

...మిగతాది 2 లో



## ఏపీ మహిళలకు మరో గుడ్ న్యూస్..

- స్త్రీ శక్తి పథకం పరిధి మరింత పెరిగింది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ వంటి గ్రౌండ్ బుకింగ్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ఆర్టీసీ అనుమతించింది. సింహాచలం ఘాట్ రూట్ బస్సుల్లోనూ ఈ పథకం వర్తింపజేసి, టోల్ ఫీజు మినహాయించాలని దేవస్థానానికి లేఖ పంపింది.

ఏపీ సర్కార్ అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' పథకం క్రమంగా మరింత విస్తరిస్తోంది. ఇప్పటివరకు ఎంపిక చేసిన బస్సుల్లోనే ఉచిత ప్రయాణం కల్పిస్తుండగా.. ఇప్పుడు గ్రౌండ్ బుకింగ్ విధానంలో నడిచే బస్సులకు కూడా ఈ పథకం వర్తించేలా ఆర్టీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని బస్సులను కండక్టర్లు లేకుండా నడుపుతూ.. రెండు-మూడు బస్టాండ్లలో

...మిగతాది 2 లో

## సర్కార్ బడి పిల్లలకు రాగిజావ



✍ **జయభేరి, హైదరాబాద్, ఆగస్ట్ 31:**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే చిన్నారుల ఆరోగ్యాలకు భరోసా ఇచ్చేందుకు రేవంత్ సర్కార్ మరో శుభవార్త చెప్పింది. సెప్టెంబర్ 1 నుంచే రాగిజావ పథకం మళ్లీ ప్రారంభం కానుంది. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి ఉదయం నుంచి ఆకలి తీర్చుకోడమే కాకుండా, ఆరోగ్యానికి తోడు న్యూట్రిషన్ కూడా పొందేలా ఈ పథకాన్ని సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు దాదాపు 18 లక్షల పిల్లలకు ఈ జావ అందుతుంది. బడుల్లో మధ్యాహ్న భోజనానికి తోడు, వారానికి మూడు రోజులు కోడిగుడ్డు, మరో మూడు రోజులు రాగిజావ అందించనున్నారు.

ఈ కార్యక్రమానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్. రాగి పౌడర్, బెల్లం సరఫరా చేస్తూ, బడిలో వడ్డించే ప్రతి గ్లాస్ జావకి ఖర్చు భరించేందుకు ముందుకు వస్తోంది. ప్రభుత్వ-ట్రస్ట్ భాగస్వామ్యంతో ఏటా సుమారు రూ.35 కోట్ల వ్యయం అవుతుంది. అందులో 60% ట్రస్ట్ భరిస్తే, మిగతా భాగం ప్రభుత్వ నిధుల నుంచి వస్తుంది. రాగిజావ తయారు చేసి పిల్లల చేతికి అందించే స్వయంసహాయక సంఘాలకు అదనంగా రాగిజావ వండినందుకు గాను.. ప్రతి గ్లాస్‌కీ రూ.25 పైసల చొప్పున చెల్లించనున్నారు. సెప్టెంబర్ 1 నుంచే ఈ పథకం ప్రారంభం కానుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.రాగి జావ అందించడం ద్వారా విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

▸▸ మొదటిపేజీ తరువాయి

## CBIకి అప్పగించడం సముచితం

అంశాలను ప్రస్తావించింది. మూడు బ్యారేజీల నిర్మాణంలో తప్పు జరిగిందని, అసలు ప్లానింగ్ లేదని కమిషన్ తేల్చిచెప్పింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ NDSA నివేదిక ప్రకారం మేడిగడ్డ నిర్మాణ వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్ లోపాలు కారణమని తేలింది. నాణ్యతా నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల నిర్మాణంలో లోపాలు ఏర్పడ్డాయని ఎన్డీఎస్ఏ గుర్తించింది. ఈ అంశాలన్నింటిపై లోతుగా, మరింత సమగ్రంగా దర్యాప్తు చేయాల్సిన అవసరాన్ని ఎన్డీఎస్ఏ, విచారణ కమిషన్ నివేదికలు స్పష్టం చేశాయి. ప్రాజెక్టులో అంతర్ రాష్ట్ర అంశాలు, కేంద్ర రాష్ట్రాలకు చెందిన వివిధ శాఖలు, ఏజెన్సీలు పాలుపంచుకున్నాయి. ప్రాజెక్టు డిజైన్, నిర్మాణం, ఫైనాన్సింగ్‌లో, వ్యాప్కోస్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు PFC, REC వంటి ఆర్థిక సంస్థలు పాలుపంచుకున్నందున ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ CBIకి అప్పగించడం సముచితం. అందుకే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ శాసనసభ నిర్ణయం తీసుకుంటున్నది. ఎన్నో రకాలైన అంశాలు, విచారణ అర్హమైన విషయాలు ఇందులో ఉండటం వల్ల సీబీఐ విచారణకు ఆదేశించాలని నిర్ణయించడం జరిగింది. నిజాయితీతో కూడిన విచారణ జరగాలని కోరుకుంటున్నాం.. అని కమిషన్ నివేదికపై చర్చకు సమాధానంగా ముఖ్యమంత్రి గారు వివరించారు. అంతకుముందు జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ కమిషన్ నివేదికను నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ శాసనసభ ముందుంచారు. అనంతరం స్పీకర్ అనుమతి మేరకు మంత్రి స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టు స్థలాన్ని మార్చడం నుంచి మేడిగడ్డ స్పీయర్స్ కుంగిపోయిన పరిణామాల వరకు, తదనంతరం జస్టిస్ ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్ నియామకం వరకు వివరాలను సభలో తెలియజేశారు. చర్చపై ముఖ్యమంత్రి సమాధానమిస్తూ, ఘోష్ కమిషన్ ఏర్పాటు నేపథ్యం, కమిషన్ సమర్పించిన 665 పేజీల నివేదికలోని సారాంశాన్ని, జరిగిన చర్చ వివరాలను ప్రస్తావించారు. నివేదికల్లో అనేక అంశాలతో మల్టిపుల్ కాంప్లికేషన్స్ తో ముడిపడి ఉన్నందున ఎలాంటి శషభిషలకు తావు లేకుండా ఒక స్పష్టమైన, నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలనుకున్న ప్రభుత్వం కేసును సీబీఐకి అప్పగించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

## ఏపీ మహిళలకు మరో గుడ్ న్యూస్..

మాత్రమే ఆగే విధంగా ఆర్టీసీ నిర్వహిస్తోంది. ఇలాంటి బస్సుల్లో ప్రయాణించే వారికి టికెట్లు ఆయా బస్టాండ్లలోనే గ్రౌండ్ బుకింగ్ విధానం ద్వారా జారీ చేస్తారు. ఇప్పుడు వీటిలోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు. ఈ సడలింపు ముఖ్యంగా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులకు వర్తిస్తుంది. అంటే చిన్న పట్టణాల నుంచి గ్రామాల వరకు నడిచే సాధారణ బస్సుల నుంచి, దూర ప్రయాణాలకు ఉపయోగించే ఎక్స్‌ప్రెస్ బస్సుల దాకా మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం లభిస్తోంది. అంతేకాదు.. సింహాచలం కొండపైకి వెళ్లే సిటీ బస్సుల్లోనూ 'స్త్రీ శక్తి' పథకం అమలులోకి వచ్చింది. యాత్రికుల ఇబ్బందులు తలెత్తకుండా ఆ బస్సులకు ఘాట్ టోల్ ఫీజు మినహాయించాలని ఆర్టీసీ అధికారులు దేవస్థానం ఈవోకి లేఖ రాసి ప్రత్యేక అనుమతి కోరారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న ఈ పథకం.. విద్యార్థినులు, ఉద్యోగినులు, వృత్తి నిమిత్తం ప్రయాణించే మహిళలకు మరింత సౌలభ్యం కలిగించేలా మారుతోంది.

## 'ప్రతిభా సేతు' పోర్టల్ ప్రారంభించిన ప్రధాని మోదీ


**ఏయే పరీక్షలు ఇది కవర్ చేస్తుందంటే?**

సివిల్ సర్వీసెస్ పరీక్షలు (IAS, IPS, మొదలైనవి)
ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్ష
ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్ష
కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (CDS)
కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్
కేంద్ర సాయుధ పోలీసు దళాల (ACs) పరీక్షలు
ఇండియన్ ఎకనామిక్ సర్వీస్/ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ఎగ్జామినేషన్
కంబైన్డ్ జియోసైంటిస్ట్ పరీక్ష

అయితే NDA & NA వంటి పరీక్షలు, కొన్ని పరిమిత విభాగ పోటీలు మాత్రం ఈ పథకం కింద కవర్ చేయరు. అయితే ఇందులో అందరు అభ్యర్థుల వివరాలను నమోదు చేయరు. అభ్యర్థుల ఇష్టానుసారమే డేటాబేస్‌లో చేర్చడం జరుగుతుంది. కేంద్ర మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు (PSUలు), స్వయంప్రతిపత్తి సంస్థలు, ప్రైవేట్ రంగ కంపెనీలు సహా ధృవీకరించబడిన యజమానులు UPSC అందించిన ప్రత్యేక లాగిన్ ID ద్వారా ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోకుని అందులోని అభ్యర్థులను ఎంపిక చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ చొరవ UPSC అభ్యర్థులకు సెకండ్ ఛాన్స్ అందించే సెకండ్ డోర్ వంటిది. వారికి కృషి తగిన ప్రతిఫలం ఈ పోర్టల్ ద్వారా అందించేందుకు వీలు కల్పిస్తుంది.

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు..

- పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు షెడ్యూల్..!!
- జారీ చేసిన ఎన్నికల సంఘం
- సెప్టెంబర్ 10 వరకు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**జయభేరి, హైదరాబాదు:**

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం షెడ్యూల్ జారీ చేసింది. ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ఎంపీటీసీలు, జడ్పీటీసీ ఎన్నికలకు ఓటర్ల జాబితాను ప్రదర్శించాలని అధికారులను ఆదేశించింది. షెడ్యూల్ ప్రకారం ఎంపీటీసీ/జడ్పీటీసీల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 9న ప్రదర్శించాలని సూచించింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించడానికి జిల్లా కలెక్టర్ ఆమోదంతో ఎంపీడీఓ, ఏడీఈఏఎస్ ద్వారా పోలింగ్ స్టేషన్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని తెలిపింది. జిల్లా ఎన్నికల అధికారులు జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో, మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఏడీఈఏఎస్ ద్వారా సెప్టెంబర్ 8న సమావేశం నిర్వహించాలని పేర్కొంది. పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలను సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు స్వీకరించాలని సూచించింది. ఏమైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే తొమ్మిదో తారీఖున పరిశీలించాలని పేర్కొంది. జిల్లా ఎన్నికల అధికారులు పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను పదో తేదీన ప్రచురించాలని స్పష్టం చేసింది. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి తప్ప అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఈ మేరకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

# చేనేతకు వెలుగులు విరజిమ్మాలి

**సిరిసిల్ల మట్టిలో పవర్లూమ్స్ పరిశ్రమ ఒక చరిత్ర. ఎన్నో దశాబ్దాలుగా వేలాది కుటుంబాలకు ఇది ఆహారాధారంగా నిలుస్తోంది. పత్తి, పాలిస్టర్ దారాలను అల్లుతూ చీరలు, వస్త్రాలు తయారు చేసే ఈ యూనిట్లు చిన్నచిన్న కార్మిక కుటుంబాలకు ప్రాణాధారం. అయినా కూడా కొన్నేళ్లుగా విద్యుత్ సమస్యలు, కేటగిరీ మార్పులు, బ్యాక్ బిల్లుల భారం కారణంగా పవర్లూమ్స్ యజమానులు కష్టాల్లో కూరుకుపోయారు.**

- కుటీర పరిశ్రమల కష్టసుఖాలు
- సిరిసిల్లలో నూతన ఆశలు

**జయభేరి, సిరిసిల్ల :**

ఇటీవల సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం వారు తమ బాధలను ప్రభుత్వానికి తెలియజేశారు. ఈ పరిశ్రమలలో ఎక్కువగా చిన్న చిన్న SSI (ఎస్సైఎస్సై - సూక్ష్మ చిన్న పరిశ్రమలు) యూనిట్లు నడుస్తున్నాయి. వీటి ద్వారా బతుకమ్మ చీరలు, ప్రభుత్వ ఆర్డర్లలో ఇచ్చిన వస్త్రాలను తయారు చేసి సరఫరా చేయడం జరిగింది. కానీ కొన్నాళ్లుగా కేటగిరీల మార్పులు, కోర్టు తీర్పులు కారణంగా ఈ యూనిట్లకు Category-IV (కేటగిరీ-ఫోర్) లో ఇచ్చే రాయితీలు Category-III (కేటగిరీ-త్రీ) కి మార్చబడినందువల్ల ఆరు సంవత్సరాల బిల్లులను ఒకేసారి చెల్లించమని డిమాండ్ చేయడం ప్రారంభమైంది. అంతేకాదు, ఆ బిల్లులకు పదెనిమిది శాతం వడ్డీతో సర్‌చార్జీలు (అదనపు చార్జీలు) కూడా వేసారు. ఫలితంగా పవర్లూమ్ యజమానులు కొత్త బిల్లులు చెల్లించడమే కాదు, పాత బిల్లుల భారంతో ఊపిరాడని పరిస్థితిలో పడిపోయారు. దీని ప్రభావం నేరుగా పదివేల మంది కార్మికుల ఉపాధిపై పడింది.

ప్రస్తుతం సుమారు ముప్పై ఐదు వేల పవర్లూమ్స్, వాటి అనుబంధ పరిశ్రమలు సైజింగ్, చిన్న డైయింగ్ యూనిట్లు, వార్పిన్, డబ్లింగ్, ట్విస్టింగ్ (దారాన్ని మడతపెట్టడం), వైండింగ్ (దారాన్ని చుట్టడం) వంటి యూనిట్లు రాష్ట్రంలో నడుస్తున్నాయి. వీటిలో నేరుగా ముప్పై వేల మంది కార్మికులు పనిచేస్తుంటే, పరోక్షంగా మరో ముప్పై వేల మంది జీవనోపాధి పొందుతున్నారు. ఈ కష్టకాలంలో ప్రభుత్వం 25 హార్స్ పవర్ (హెచ్.పి. - గుఱ్ఱాల శక్తి) వరకు యూనిట్లను Category-IVలో పెట్టి యాభై శాతం సబ్సిడీ ప్రకటించడం ఒక గొప్ప ఉపశమనం. దీనికి పరిశ్రమ యజమానులు కృతజ్ఞతలు తెలిపారు. అయినా కూడా బ్యాక్ బిల్లుల సమస్యను పరిష్కరించకపోతే పరిశ్రమ పూర్తిగా దెబ్బతింటుందని వారు మనవి చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారమైతే సిరిసిల్లలో పవర్లూమ్స్ రంగం రెట్టింపు స్థాయికి పెరిగే అవకాశం ఉంది. కార్మికులకు మరింత ఉపాధి లభిస్తుంది. అలాగే ఈ పరిశ్రమల కోసం ఏర్పాటు చేసిన యారన్ బ్యాంక్ (దారపు నిల్వ గిడ్డంగి) కూడా మరింత సమర్థవంతంగా పనిచేయడానికి సహాయపడుతుంది. దారాన్ని కొనుగోలు చేసే యజమానులకు పది శాతం సబ్సిడీ ఇస్తే, ఉత్పత్తి ఖర్చులు తగ్గి పోటీగా నిలవగలుగుతారు. సిరిసిల్లలో పవర్లూమ్స్ తయారు చేసే వస్త్రాలకు ప్రత్యేకంగా అమ్మకాల కేంద్రం ఏర్పాటుచేస్తే మార్కెట్ సమస్యలు పరిష్కరమవుతాయి.

అలాగే వర్కర్ టు ఓనర్ పథకం త్వరగా అమలులోకి వస్తే, ప్రస్తుతం కూలీగా పనిచేసే కార్మికులు యజమానులుగా ఎదిగి తమ కుటుంబాలను స్థిరపరచుకోగలుగుతారు. మరోవైపు డైయింగ్, సైజింగ్ యూనిట్లకు ప్రత్యేక స్థలాలు కేటాయిస్తే కాలుష్య సమస్య కూడా తగ్గుతుంది. ఈ మొత్తం విషయాలను గమనించినప్పుడు పవర్లూమ్స్ పరిశ్రమ ప్రస్తుత పరిస్థితి ఒక మలుపు వద్ద నిలిచినట్టుగా కనిపిస్తుంది. ఒకవైపు కష్టాలు, మరోవైపు కొత్త అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికే కొన్ని సానుకూల నిర్ణయాలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపినా, మిగతా సమస్యలు పరిష్కారమైతే సిరిసిల్ల పవర్లూమ్స్ పరిశ్రమకు ఒక స్వర్ణయుగం తిరిగి రావడం ఖాయం. సాధారణ కార్మికుల జీవితాలను కాపాడి, చేనేతకు కొత్త ఊపిరి పోసి, సిరిసిల్ల మట్టిలో మళ్లీ కొత్త వెలుగులు విరజిమ్మాలని అందరి ఆకాంక్ష.



డా. చిటికెన కిరణ్ కుమార్
యుఎన్ఐసిసిడిఆర్ పురస్కార గ్రహీత
ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు
ఐబిఆర్ఎఫ్ సభ్యులు
సెల్: 9490 841 284

# ఉగ్రవాదానికి క్రిప్టో కరెన్సీ ఉపయోగిస్తున్న పాకిస్థాన్...

- దర్యాప్తులో విస్తుపోయే నిజాలు!
- జమ్ముకశ్మీర్‌లో క్రిప్టోకరెన్సీ ద్వారా ఉగ్ర నిధుల బదిలీ
- రాష్ట్ర దర్యాప్తు సంస్థ (ఎస్ఐఏ) దాడుల్లో బయటపడిన నెట్‌వర్క్
- హవాలా స్థానంలో అజ్ఞాతంగా నిధులు పంపుతున్న పాకిస్థాన్
- అధికారికంగానే క్రిప్టో కౌన్సిల్ ఏర్పాటు చేసిన పాక్ ప్రభుత్వం
- టెర్రర్ ఫండింగ్‌కు కొత్త టెక్నాలజీ.. భారత ఏజెన్సీలకు పెనుసవాల్

**జయభేరి, జమ్ముకశ్మీర్ :**

జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చేందుకు పాకిస్థాన్ సరికొత్త, అత్యంత ప్రమాదకరమైన మార్గాన్ని ఎంచుకుంది. ఇప్పటివరకు హవాలా, నార్కోటిక్స్, నకిలీ కరెన్సీ వంటి పాత పద్ధతులపై ఆధారపడిన పాక్, ఇప్పుడు వాటిని పక్కనపెట్టి క్రిప్టోకరెన్సీ ద్వారా గుట్టుచప్పుడు కాకుండా నిధులు పంపుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. గత నెలలో జమ్ముకశ్మీర్ రాష్ట్ర దర్యాప్తు సంస్థ (ఎస్ఐఏ) జరిపిన దాడుల్లో ఈ డిజిటల్ కుట్ర బట్టబయలైంది. దేశంలో ఉగ్రవాదానికి క్రిప్టో నిధులు అందుతున్నట్లు నిర్ధారణ కావడం ఇదే మొదటిసారి. గత నెలలో ఎస్ఐఏ నిర్వహించిన సోదాల్లో కీలకమైన ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దర్యాప్తులో, సరిహద్దుల నుంచి కశ్మీర్‌లోని ఉగ్రవాదులకు క్రిప్టోకరెన్సీ రూపంలో నిధులు అందుతున్నట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. "దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడటంలో మా నిబద్ధతకు ఈ సోదాలే నిదర్శనం" అని ఎస్ఐఏ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. సాధారణంగా హవాలా వంటి మార్గాల్లో నిధులు పంపినప్పుడు, దర్యాప్తు సంస్థలకు ఏదో ఒక దశలో నిధుల జాడ (మనీ ట్రయల్) దొరికేది. ఈ ఆధారాలతోనే గతంలో అనేక ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్‌కు సంబంధం ఉందని భారత ఏజెన్సీలు నిరూపించగలిగాయి. కశ్మీర్‌లో వేర్పాటువాదుల వెన్ను విరవడంలో వారి నిధుల మార్గాలను అడ్డుకోవడం కీలక పాత్ర పోషించింది. అయితే క్రిప్టో లావాదేవీలు చాలావరకు అజ్ఞాతంగా జరుగుతాయి. పంపినవారు, అందుకున్నవారి వివరాలు సులభంగా గుర్తించలేం. దీంతో దర్యాప్తు సంస్థలకు నిధుల మూలాలను కనిపెట్టడం పెనుసవాల్‌గా మారింది. ఈ ఏడాది మార్చి 2025లో పాకిస్థాన్ ప్రభుత్వం అధికారికంగా "పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్" ఏర్పాటు చేయడం గమనార్హం.



అంతేకాకుండా, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబంతో సంబంధాలున్న "వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్" అనే క్రిప్టో సంస్థతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. పెట్టుబడులను ఆకర్షించేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పాకిస్థాన్ బాహ్య ప్రపంచానికి చెబుతున్నప్పటికీ, దీని వెనుక ఉగ్ర నిధులను సులభతరం చేసే కుట్ర దాగి ఉందని భారత ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడానికి ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, సామాజిక మాధ్యమాలు, వర్చువల్ ఆస్తులను దుర్వినియోగం చేస్తున్నారని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) కూడా తన నివేదికలో హెచ్చరించింది. 2019లో హమాస్ ఉగ్రవాద సంస్థ తొలిసారిగా క్రిప్టో ద్వారా విరాళాలు సేకరించడం మొదలుపెట్టింది. గత ఏడాది జరిగిన రామేశ్వరం కేఫ్ పేలుడు (2024), పుల్వామా దాడి (2019) వంటి కేసుల దర్యాప్తులోనూ ఉగ్రవాదులు క్రిప్టో వ్యాలెట్లు, చైనీస్ యాప్‌లు, డార్క్‌నెట్‌ను వాడుతున్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గుర్తించింది.



## విద్య అన్నది ఒక గొప్ప ఆయుధం

దేశ భవిష్యత్తును నిర్మించుకోవడానికి విద్య ఒక్కటే మార్గమని, అందుకే తెలంగాణలో విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. "విద్య అనేది మనకు లభించిన ఒక గొప్ప బహుమతి. విద్య అన్నది ఒక గొప్ప ఆయుధం. అదే అందరికీ గొప్ప శక్తి.. అని బలంగా విశ్వసిస్తా" అని అన్నారు. కేరళలోని అలప్పుళలో లోక్‌సభ సభ్యుడు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ప్రతిభ కనబరిచే విద్యార్థినీ విద్యార్థులకు ఎంపీ మెరిట్ అవార్డులు 2025 బహూకరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యకు కేరళ రాష్ట్రానికి బలమైన సంబంధం ఉందని, దేశంలో వంద శాతం అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రంగా కేరళ అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అణిచివేత, అన్యాయానికి గురవుతున్న బాధితుల గొంతుకగా వేణుగోపాల్ గారు నిరంతరం నిరుపేదలు, అణగారిన వర్గాల పక్షాన నిలుస్తున్నారు. 10 వ, 12 తరగతుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కోసం 2006 లో ప్రారంభించి 19 ఏళ్లుగా పొంథువల్ ఎంపీ మెరిట్ అవార్డులను బహూకరించడం అభినందనీయం. ఇలాంటి కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయి. రానున్న రోజుల్లో విద్యకున్న ప్రాధాన్యత గురించి నేను ప్రతి సందర్భంలోనూ ప్రజలకు చెబుతుంటా. విద్యా రంగంపై ప్రభుత్వాలకు సరైన ఫోకస్ లేని కారణంగానే ప్రభుత్వంకన్నా ప్రైవేటు పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరుతున్నారు. తెలంగాణలో విద్యా రంగాన్ని ఒక సవాలుగా తీసుకుని పనిచేస్తున్నాం. ఇప్పుడు తెలంగాణలో విద్యా రంగాన్ని ఒక సవాలుగా తీసుకుని పనిచేస్తున్నాం. అందుకే తెలంగాణలో వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలు నిర్మిస్తున్నాం. ప్రతి పాఠశాలకు 200 కోట్ల రూపాయలు వెచ్చించి ఒక్కో క్యాంపస్ లో 2500 విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దేశానికి స్వాతంత్ర్యం సాధించి వందేళ్లవుతున్న 2047 నాటికి బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్య సాధనలో తెలంగాణ నుంచి 10 శాతం మేరకు దోహదపడాలన్న సంకల్పంతో 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక శక్తిగా మా రాష్ట్రం లక్ష్యంగా నిర్ధేశించుకుంది. ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ విద్యార్థుల్లో సరైన నైపుణ్యత లేని కారణంగా నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, అందుకే మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా లాంటి పారిశ్రామిక దిగ్గజాలు, నిపుణులు, నిష్ణాతులతో కలిసి రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించాం. మార్కెట్ లోకి అధునాతన కార్లు వస్తున్న దశలో పాత అంబాసిడర్ కార్లను రిపేర్ చేసే మెకానిక్ కోర్సులను బోధించే ఐటీఐలను టాటా టెక్నాలజీస్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో వాటిని పూర్తిగా మార్చి వేసి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చుతున్నాం. సౌత్ కొరియా లాంటి చిన్న దేశం ఒలింపిక్స్‌లో 32 పతకాలు సాధించగా, 140 కోట్ల జనాభా కలిగిన భారతదేశం ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణ పతకం సాధించలేకపోవడం విచారించదగిన విషయం. అందుకే తెలంగాణలో సంజయ్ గోయంకా లాంటి దిగ్గజాలతో తెలంగాణ స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు చేశాం. వారి నేతృత్వంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ స్థాపిస్తున్నాం. యువతను క్రీడారంగంపై ఆసక్తిని పెంచడానికి కొరియా, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లోని యూనివర్సిటీలతో ఒప్పందం చేసుకున్నాం.

# విద్యార్థులకు చదువు దూరం...

- పాఠశాలలో సమస్యలు...!
- ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలు తీర్చాలి!,
- లేదంటే ఉద్యమం తప్పదు!
- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్
- షాద్ నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కొందుర్గు మండలం బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించిన నాయకులు..




**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 31 :**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని చెప్తూ ఉన్నారు. కానీ నేడు పేద విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్రనే ఈ ప్రభుత్వం చేస్తుంది అని ఎస్ ఎఫ్ ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. ఉపాధ్యక్షులు శ్రీకాంత్ మాట్లాడుతూ.. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు నేలపై కూర్చుని విద్యను అభ్యసిస్తా ఉన్నారు కనీసం విద్యార్థులకు బెంచీలు లేవు అలాగే టీచర్లకు కూర్చోవడానికి కుర్చీలు కూడా లేనటువంటి పరిస్థితి అంతేకాకుండా అక్కడ ఏదైతే బిల్డింగ్ ఉందో ఆట స్థలం లేదు అక్కడున్నటువంటి బిల్డింగ్ పక్కనే గ్యాస్ గోదాము ఉన్నది దాని వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. అలాగే ఈ గురుకుల పాఠశాల ఏర్పడి 8 సంవత్సరాలు గడుస్తా ఉన్న ఇప్పటికి విద్యార్థులు నేలపై కూర్చోనే విద్యను అభ్యసిస్తా ఉన్నారు అలాగే విద్యార్థులు పడుకోవడానికి బెడ్స్ కూడా లేవు ఏదైతే వారు ఇంట్లో నుంచి సపలు తెచ్చుకొని వాటి మీద పడుకున్నటువంటి పరిస్థితి మనం కొందుర్గు గురుకుల పాఠశాలలో చూడవచ్చు.....కాబట్టి ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్కడున్నటువంటి గురుకుల హాస్టల్ను సందర్శించిజ విద్యార్థులకు ఉన్నటువంటి ఇబ్బందులు తెలుసుకొని వాటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఎస్ఎఫ్ఐ గా మేము ఆశిస్తూ ఉన్నాం. అలాగే అక్కడి నుంచి ఆ బిల్డింగును షిఫ్ట్ చేస్తామని అంటా ఉన్నారు కానీ అలా చేయడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని కాబట్టి అక్కడ ఉన్నటువంటి ఆ గ్యాస్ గోదామును మరియు విద్యార్థులకు సరిపడా బెంచీలు, వాళ్ళు పడుకోవడానికి బిట్స్ అరేంజ్ చేసి అక్కడే పాఠశాల నడిపించాలని అటు నుంచి ఇక్కడికి మారవ వద్దని ఎస్ఎఫ్ఐ గా డిమాండ్ చేస్తా ఉన్నాం. లేనిపక్షంలో ఒకవేళ ఆ స్కూల్ అక్కడ్నుంచి వేరే ప్రదేశానికి మారిస్తే కచ్చితంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావడానికి విద్యార్థులతో కలిసి పోరాటాలు చేయడానికి ఎస్ఎఫ్ఐ నాయకులు ఎప్పుడు ముందుంటారు అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కొందుర్గు మండల కార్యదర్శి ప్రవీణ్ ,టౌన్ అధ్యక్షులు ఆదిల్, ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## బహిరంగ మద్యం కేసులో పట్టుబడ్డవారిపై కేసు నోమోదు

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం నాయుడుపాలెం పంచాయతీ బండారుపాలెం జంక్షన్ వద్ద పరవాడ పోలీసులు అకస్మాత్తుగా రైడ్ నిర్వహించారు. ఈ రైడ్లో ముత్యాలపాలెం చెందిన చింతకాయల రాజు, చింతకాయల నాయుడు అనే ఇద్దరు వ్యక్తులు అక్కడ ఓపెన్ డ్రింకింగ్ చేస్తూ న్యూసెన్స్ సృష్టిస్తుండగా పట్టుబడ్డారు. వారి వాహనాలను తనిఖీ చేసి, ఓపెన్ డ్రింకింగ్ కేసులు బుక్ చేశారు . ఈ సందర్భంగా పరవాడ పోలీసులు హెచ్చరిస్తూ ఇకపై గంగునాయుడుపాలెం, నాయుడుపాలెం, హస్తినాపురం, బండారుపాలెం ప్రాంతాలలో ఎవరు ముత్యాలపాలెం నుంచి వచ్చి రహదారుల మీద ఓపెన్ డ్రింకింగ్ చేస్తూ న్యూసెన్స్ సృష్టించినా వారిపై కఠిన చర్యలు తప్పవని పరవాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపారు.

## మహా ధర్నాను విజయవంతం చేయాలి



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 31:**

నేడు హైదరాబాదులో పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుర్కపల్లి మండల శాఖ అధ్యక్షుడు బాశెట్టి విష్ణు అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నేడు హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నిర్వహిస్తున్న మహా ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. 2004 జనవరి 1 ఆనాటి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీములో భాగంగా ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం 2004 సెప్టెంబర్ 1న మన ఉమ్మడి రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ అమలు చేయడం వల్ల 2004 సంవత్సరం సెప్టెంబర్ మాసం తర్వాత నియామకమైన ఉద్యోగ ఉపాధ్యాయులు అందరి నోట్లో మట్టి కొట్టినట్లు అయిందని అన్నారు. పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలని అన్నారు. బలవంతంగా సిపిఎస్ అమలు చేయబడ్డ సెప్టెంబర్ ఒకటవ తేదీను పెన్షన్ విద్రోహ దినం గా పాటిస్తూ బ్లాక్ డ్రెస్ ధరించి రావాలని కోరారు

## ఎక్సలిసివే వరల్డ్ బుక్ అవార్డులు




**జయభేరి, దేవరకొండ :**

సమాజంలో సమాచార హక్కు చట్టం పై ప్రజలు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం మరింత పెరిగిందని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ అన్నారు. హైదరాబాదులో శనివారం నాడు సుందరయ్య విజ్ఞాన కళాభవన్లో శ్రీ విఘ్నేశ్వర ఆర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఎక్సలిసివే వరల్డ్ బుక్ ఆఫ్ అటెంప్ట్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ అడిషనల్ డీసీపీ తేజావత్ రామదాసు సినీ హీరోలు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుండ్లపల్లి (డిండి) మండలం కొత్త తండా కు చెందిన సమాచార హక్కు చట్టం రక్షణ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ చేసిన సేవలను గుర్తించి బ్రహ్మాండ సినిమా హీరో చేతుల మీదుగా ఎక్సలిసివే వరల్డ్ బుక్ ఆఫ్ అటెంప్ట్ 2025 అవార్డును అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ఆర్.టి.ఐ సమాచార హక్కు చట్టం పై ప్రజలలో అవగాహన కల్పిస్తూ ప్రజల కోసమే రూపొందించబడిన ఆర్టిఐ పై ప్రజలలో మరింత మేలుకొలుపును పెంపొందించే దిశగా ముందుకు వెళుతున్న క్రమంలో ఇలాంటి అవార్డు ను అందించడం శుభ తరుణమని వారన్నారు.

ఈ అవార్డు అందుకోవడంతోపాటు మరింత బాధ్యత పెరిగిందని ప్రజలు ప్రభుత్వం రూపొందించిన చట్టాలను వినియోగించుకోవాలని ప్రతి ఒక్కరికి చట్టంలో ప్రశ్నించే అధికారం ఉందని ప్రజలు ప్రభుత్వ అధికారులు పని తీరులోనీ ప్రజల స్వంతమైన చట్టపరమైన అంశాలను ప్రజలు ఉపయోగించుకోవాలని వారు కోరారు. రానున్న రోజులలో సమాచార హక్కు చట్టంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలలో అవగాహన కొరకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయబోతున్నామని ప్రజలు సమాజం పట్ల బాధ్యత కలిగిన యువకులు ముందుకు రావాలని వారు తెలిపారు.

## కాంగ్రెస్ కుట్ర రాజకీయాలు మానుకోవాలి



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ బిజెపి మున్సిపల్ అధ్యక్షులు వస్కుల సుధాకర్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతావత్ లాలు నాయక్ జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ నిన్న బీహార్ లో జరిగినటువంటి రాహుల్ గాంధీ యాత్రలో ఈ దేశ ప్రధాని నరేంద్ర మోడీ మీద అలాగే వారి అమ్మ మీద రాహుల్ గాంధీ చేసినటువంటి వాక్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పడం జరిగింది ఈ దేశ ప్రధాని మీద ప్రతిపక్ష నాయకుడు అనాలోచితంగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అని నరేంద్ర మోడీ ని రాజకీయం గా ఎదుర్కొనే శక్తి లేక మానసికంగా దెబ్బతీసే కుట్రాలకు కాంగ్రెస్ తెరలేపింది అని భారత రాష్ట్రపతి ద్రౌపది మూర్మ్ పై గతంలో సోనియా గాంధీ అవమానపరిచేలా మాట్లాడారని రాజకీయంగా ఎదుర్కొనే శక్తి లేని కాంగ్రెస్ ఈ విధంగా కుట్ర రాజకీయాలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఆలోచన మార్చుకపోతే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పబ్బు సైదులు, ప్రధాన కార్యదర్శులు సముద్రాల సహదేవ్(దేవరకొండ వాసవి క్లబ్ అధ్యక్షులు) చిత్రియాల నాగేంద్ర, చిలక రాజు బిక్కు , రెడ్డి శంకర్, కాసుల శంకరయ్య, నీల సుమన్, కర్నాటి వజ్రకుమార్, గంజి హరి, అప్పం అజయ్, సంపంగి సైదులు,పగిళ్ళ రామ్, పున్న నాగరాజు, పున్న వెంకటేష్ నేత, నేతల రాము, కోటి ,తిరుపతి గౌడ్, శంకర్ నాయక్, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

**వినాయక చవితిని పురస్కరించుకొని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విహారిక కాలనీ, ఓం విహార్ కాలనీ, మారుతీ నగర్, సాయి ప్రియ నగర్,పంచవతి, కాలనీ, కాకతీయ నగర్ కాలనీ, శ్రీ నిలయం అపార్ట్మెంట్, మందడి ఎలీట్, సేవ్ హాస్పిటల్ నందు గణనాథుని ఐదవ రోజు పూజ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పాల్గొని గణపతిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమములను ప్రారంభించి, భక్తులకు అన్న వితరణ చేశారు.**

**ఈ కార్యక్రమంలో నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాలనీ అధ్యక్షాకార్యదర్శులు ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, పెద్దలు, మహిళలు తదితరులు భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదలు స్వీకరించారు.**

**జయభేరి, మేడిపల్లి**







## లంకెలపాలెంలో ఉత్తరాంధ్ర మహిళలు కబడ్డీ పోటీలు

**జయభేరి, పరవాడ:**

జీవిఎంసి పరిధిలో లంకెలపాలెంలో వరసిద్ధి వినాయక మహోత్సవ సందర్భంగా లంకెలపాలెం ఊరిలో ఆర్బిఆర్ యూత్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర మహిళలు కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారంభం అయ్యాయి కబడ్డీ పోటీలో మొత్తం 30 జట్లు పాల్గొన్నాయి అందులో 5 మహిళా జట్లు పాల్గొన్నాయి. ఈ యొక్క కార్యక్రమంలో మంత్రి గిరి ప్రసాద్,చిట్టి బోయిన కోటేశ్వరరావు,నారా పిన్ని యువ కిషోర్,కరణం దాద్రాజు,కరణం నర్సింగరావు, ఆర్మీ బుజ్జి,కర్రీ అప్పారావు,దాసరి జగదీష్,నాయుడు సతీష్,నాయుడు,శేఖర్,కోరుకొండ మోహన్,కరణం ఉమా,మహేష్,కర్రీ నరేంద్ర,ఉగ్గిన దత్తు,దాసరి సాయి,కర్రీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపం వద్ద అన్నప్రసాద వితరణ



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 31:**

తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయకుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయకుని మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కల్లూరి ప్రభాకర్ రెడ్డి, వేముల ప్రమీల లక్ష్మీ నరసయ్య, నీటి సంఘం చైర్మన్ ఎర్ర పాపయ్య ,పాల సంఘం చైర్మన్ కొడపాక బిక్షపతి, నారా నరసింహ గౌడ్, సిహెచ్ శ్యామ్ రెడ్డి, పల్లెపాటి కరుణాకర్ ,పల్లెపాటి అనిల్, పల్లెపాటి వంశీ ,కల్లూరి శ్రీనాథ్ రెడ్డి జంగ విజయ్, అన్నం పట్ల కరుణాకర్, పల్లెపాటి యాదగిరి, రేణు కుమార్, కొడపాక బాలయ్య,ఎర్ర ప్రకాష్ ,పల్లెపాటి పోచయ్య, పల్లెపాటి గణేష్, వేముల లక్ష్మయ్య, అన్నంపట్ల బాలయ్య, గ్రామ యువకులు పాల్గొన్నారు

## గణనాథుని దర్శించుకొని ప్రత్యేక పూజలు

- వడ్త్య రమేష్ నాయక్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణం లోని ముత్యాలమ్మ బజార్ లో కొలువైన గణనాథుని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ రమేష్ నాయక్ ఆలయముకు ఇచ్చిన రూపాయల సహకారంతో ఆలయం ఆధునికరణ వైభవంగా నిర్వహించామని శ్రావణమాసంలో ముత్యాలమ్మ తల్లి గుడికి ప్రతి కుటుంబ సభ్యులు వచ్చి నైవేద్యం సమర్పించి మొక్కలు తెచ్చుకుంటారని కొత్తగా పెళ్లయిన జంటలు తప్పకుండా ఈ గుడికి వచ్చి దర్శించుకుంటారని ఆలయ కమిటీ వారు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నక్క వెంకటేష్, నేతల్ల వెంకటేష్, పగిడిమర్రి రఘు రాములు, నీలా రవి, కొమోజు మురళి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజా నగర్ తండాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలంలోని గిరిజా నగర్ తండాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేయటం జరిగింది దేవరకొండ మండల అధ్యక్షులు నేనావత్ రాము నాయక్ మాట్లాడుతూ బీహర్ లో రాహుల్ గాంధీ చేస్తున్న యాత్రలో , రాహుల్ గాంధీ మహమ్మద్ రిజ్వీ మోదీ తల్లిని అసభ్య పదజాలంతో దూషించారు 79 సంవత్సరాల స్వతంత్ర బారతావనిలో వాజపేయి తర్వాత మనకు దక్కిన ఒక కోహినూర్ వజ్రం, అ వజ్రాన్ని సాన పట్టి ఈ బారత దశా,దిశ మార్చుతూ ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తున్న మహనీయుడు, నరేంద్ర దామోదర దాస్ మోదీ అలాంటి ఉత్తమోత్తమ మహా పురుషుడి మాత్రుమూర్తిని కించపరిచి ఈదేశ ప్రదాని తల్లిని, అందునాస్వర్గస్థురాలిపై వ్యాఖ్యలు బాధాకరమన్నారు ఈ కార్యక్రమంలో గుండాల అంజయ్య, చండీశ్వర్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ,వర్త్య రవీందర్ మోడీ మండల ఉపాధ్యక్షులు నేనావత్ దశరథ్ నాయక్,కేలోత్ శంకర్ నాయక్ మండల కోశాధికారి ఇస్లావత్ గణేష్ నాయక్ కార్యదర్శి, లచ్చి రామ్ నాయక్ ,తదితరులు పాల్గొన్నారు.



## వినాయకుని మండపం వద్ద అన్నదాన కార్యక్రమం

జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 31:

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలోని శ్రీ కృష్ణ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని వద్ద నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని జూపల్లి నవీన్ కుమార్ ,కిరణ్ గౌడ్ ల సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జింకల ఎల్లేష్ యాదవ్, స్థాపకిష్టయ్య, కలకుంట్ల శేఖర్, సిరిగిరి వెంకటేశం ,శాప కనకయ్య, సాగర్ల శ్రీకాంత్ ,జూపల్లి నరసింహులు, శాప నరసింహులు, మాడిశెట్టి శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులచే గణేష్ శోభాయాత్ర



జయభేరి, దేవరకొండ :

మీనాక్షి ప్లాజా కాంప్లెక్స్ లో కొలువుదీరిన HMC DANCE STUDIO లోని గణపతి విద్యార్థులచే పూజలు అందుకొని ఆనందంగా సంతోషంగా గణపతి తల్లి వద్దకు విద్యార్థులు శోభయాత్ర నిర్వహించినారు శోభ యాత్రలో నృత్య ప్రదర్శనను గణపయ్య కనుల విందుగా తిలకించినాడు దేవరకొండ నియోజకవర్గం దాటి నల్గొండ జిల్లాలోనే ఏడుకొండల్ మాస్టర్ విద్యార్థులకు కు మంచి నృత్యాలు నేర్పిస్తూ అందరి మన్ననలు పొందుతూ ఏడుకొండల్ డాన్స్ మాస్టర్ మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. ఏ కార్యక్రమమైనా సరే కొండలు మాస్టర్ లేనిది లోటు ఉంటది అనే విధంగా కొండలు మాస్టర్ పేరు తెచ్చుకున్నారు. శోభయాత్రను అంగరంగ వైభవ నిర్వహించినారు. ఈ శోభయాత్ర కార్యక్రమంలో ఏడుకొండలు డాన్స్ మాస్టర్, కవిత, త్రిష, చింటు,వేణు, అఖిల్, గ్రీష్మన్, ప్రేమిక, మౌనిక, నిత్య, చరణ్, రవి, వర్షిణి, అరుణ, రాజేష్, నిఖిల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ అమలు అయ్యే విధంగా చూడాలి



జయభేరి, ఉప్పల్ :

గతంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెన్షన్ పై అఫీషియల్ బులిటెన్ రిలీజ్ చేయకపోవడంపై, అసెంబ్లీ నిర్వహణ ఆలస్యం కావడంపై స్పీకర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. ఇంపార్టెంట్ పని పక్కన పెట్టి సీఎం ఇతర రాష్ట్రాల్లో తిరగడంపై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల అసహనం. త్వరగా అసెంబ్లీ నిర్వహించాలని స్పీకర్‌ను కోరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. ప్రోటోకాల్ ఇష్యూస్ పై కూడా స్పీకర్‌తో చర్చించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. ఎమ్మెల్యేలను పిలవకుండా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అంటూ అసహనం. స్థానికంగా ఉన్న కాంగ్రెస్ లీడర్లతో సంక్షేమ కార్యక్రమాలను లాంచ్ చేపిస్తున్నారు అంటూ మండిపాటు. ప్రోటోకాల్ అమలు అయ్యే విధంగా చూడాలని స్పీకర్‌ను కోరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

## విఘ్నాలు తొలిగి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ డివిజన్ మరియు చిలుక నగర్ డివిజన్ లో పలు వినాయక మండపాలను సందర్శించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న BRS పార్టీ రాష్ట్ర నాయకులు బండారి నీలం రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ విగ్నేశ్వరుని ఆశీస్సులతో విఘ్నాలు తొలిగి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆ విఘ్నేశ్వరుడు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు ప్రసాదించాలని ప్రార్థిస్తూ... గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా భక్తి శ్రద్ధలతో ఆనందంతో జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి నిరోధక శక్తిగా మారిన తెల్లం వెంకటరావు

- గారు తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలి
- బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మాయ,మరాఠీల రాజకీయాలను ప్రజలు నమ్మొద్దు
- బహుజనుల అభివృద్ధి,సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేస్తున్న బీఎస్పీకి అధికారం ఇవ్వండి.
- బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు కొండా చరణ్



జయభేరి, చర్ల, ఆగస్టు 31 :

చర్ల మండలం కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు కొండా చరణ్ హాజరు అయ్యారు. ఈసందర్భంగా కొండా చరణ్ మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు భద్రాచలం రామయ్య ఆలయ అభివృద్ధికి మరియు భద్రాచల నియోజకవర్గ అభివృద్ధికి 100 కోట్లు ఇస్తామని సాక్షాత్తు రామయ్య సాక్షిగా చెప్పడం జరిగింది 100 కోట్లు కాదు కదా ఒక్క రూపాయి కూడా భద్రాచలం అభివృద్ధికి రామయ్య గుడి అభివృద్ధికి పట్టణ అభివృద్ధికి బిఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించలేదని పేర్కొన్నారు వరదల సమయంలో కేసీఆర్ పర్యటన చేసి వరద బాధితుల సమస్య పరిష్కారం కోసం కరకట్ట పునర్నిర్మాణం కోసం భద్రాచల నియోజకవర్గ అభివృద్ధి కోసం కేసీఆర్ 1000 కోట్లు ఇస్తామని ప్రగల్బాల పలికారు ఏమీ ఇవ్వకుండా సాక్షాత్తు భద్రాచలం శ్రీరామచంద్రుని, మరియు భద్రాచలం ప్రజలను మోసం మోసం చేసి బిఆర్ఎస్ పాపం కట్టుకుందని తెలిపారు భద్రాచలం రామయ్యను మోసం చేసినందుకే ఎన్నికల్లో ఓటమి పాలైందని అన్నారు మళ్లీ ఇప్పుడు ఎన్నికలు వచ్చేసరికి కల్లబొల్లి కబుర్లతోటి ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారు పదేళ్ల పరిపాలనలో ఏమి చేయకుండా ఇప్పుడు మళ్లీ మాకు అధికారం ఇవ్వండి అని అంటున్నారు ప్రజలు ఈ రాజకీయ కుట్రలను గమనించాలని కోరారు ప్రస్తుత భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు టిఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని రామయ్య సన్నిధిలో ప్రమాణం చేసి మాట తప్పడనీ భగవంతుని సైతం మోసం చేసే ఘనులు ప్రజలకు ఏం న్యాయం చేస్తారనీ ఎద్దేవా చేశారు.

ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు గారు నియోజకవర్గ అభివృద్ధి నిరోధక శక్తిగా తయారయ్యాడని నియోజకవర్గ ప్రజలే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ఇతర జిల్లాల నుంచి భద్రాచల నియోజకవర్గంలో ప్రయాణించిన ప్రజలు గుంతల రోడ్లు చూసి బెంబేలెత్తి పోతున్నారని విమర్శించారు భద్రాచలం కున్న గౌరవ మర్యాదలను చెడగొట్టడానికి ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు గారికి ఎవరు హక్కు ఇచ్చారని మండిపడ్డారు ఇసుక లారీలు ప్రజలను గుద్ది చంపడానికేనా ప్రజలు తెల్ల వెంకటరావుని ఎమ్మెల్యేని చేసింది అని ప్రశ్నించారు ఇసుక లారీల కారణంగా రోడ్లపై ఏర్పడ్డ గుంతల కారణంగా జరుగుతున్న ప్రమాదాలకు పోతున్న ప్రాణాలకు తెల్ల వెంకటరావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు చేస్తున్న ఈ మాయల మరాఠీ రాజకీయ కుట్రలను ప్రజలు గమనించాలని అన్నారు నిరంతరం ఎస్సీ, ఎస్టీ బీసీ మత మైనారిటీ ప్రజలైన బహుజనుల అభివృద్ధి కోసం సామాజిక న్యాయం కోసం భారత రాజ్యాంగ రక్షణ కోసం పాటుపడుతున్న బీఎస్పీకి ప్రజలు ఓట్లు వేసి అధికారం ఇవ్వాలని తద్వారా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించునీ నియోజకవర్గన్నీ అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జి సామల ప్రవీణ్, చర్ల మండల పార్టీ అధ్యక్షులు కొండా కౌశిక్ , చర్ల మండలం ఉపాధ్యక్షులు చెన్నం మోహన్, మండల కార్యదర్శి గుర్రాల విజయ్ కుమార్, పార్టీ మండల కోశాధికారి ఎస్కే జహురిదీన్ భాష చర్ల సెక్టార్ కార్యదర్శి కోటిపల్లి వాసు, పార్టీ నాయకులు చెన్నం పవన్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెలో ఎగిరిన ముదిరాజ్ జెండా..

- ముదిరాజులందరం ఐకమత్యంతో ముందుకు వెళ్దాం
- ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో రాయికల్ గ్రామంలో జెండా ఆవిష్కరణ
- మహాత్మ గాంధీ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నమస్కరించిన అందె బాబయ్య



జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 31 :

ముదిరాజులంతా ఐకమత్యంతో ముందుకు సాగిన రోజున మన హక్కులు సాధించుకుంటామని, ప్రతి గ్రామంలో ముదిరాజుల జెండా ఎగరాలని అందె బాబయ్య పిలుపునిచ్చారు. రాయికల్ గ్రామంలో గ్రామ ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో ముదిరాజ్ జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు షాద్ నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం, ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ రాష్ట్ర నాయకులు అందే బాబన్న తాలూకా అధ్యక్షులు చెట్ల జంగయ్య, అంచ రాములు, అందే పైలయ్య ముదిరాజు, షాద్ నగర్ తాలూకా యువత అధ్యక్షులు శ్రీధర్ వర్మ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఐక్యమత్యంతో ముందుకు సాగిన రోజే మన హక్కులను మనం సాధించుకుంటామని అన్నారు ఈ కార్యక్రమంలో పాలమూరు రాబిన్ వుడ్ పండుగ సాయన్నని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని బడుగు బలహీన వర్గాలకు ఒక ఆపద్బాంధవుడిగా పండుగ సాయన్న కు జెండా ఆవిష్కరణ సందర్భంగా పూలమాలతో, పుష్పాలతో ఆ మహనీయుని స్మరించుకుంటూ నమస్కరించారు. యువత ఉపాధ్యక్షులు మంగ అశోక్ ముదిరాజ్ నాయకులు పిట్టల అంజయ్య లీగల్ అడ్వైజర్ కానుగు అంతయ్య ముదిరాజ్, కూతల వేణుగోపాల్ ముదిరాజ్, నాయకులు, గుంటి శంకర్ ముదిరాజ్ పసుపుల ప్రశాంత్ ముదిరాజ్, బుడ్డ నరసింహులు మదలాపూర్ సతీష్, మధు, కొందుర్గు మండలం ఈసారి సత్యనారాయణ, ఫరూక్నగర్ కుడుముల బాలరాజ్, గ్రామ ముదిరాజ్ నాయకులు రాయికల్ సంద నర్సింలు సంద శ్రీనివాస్ ముదిరాజ్, గ్రామస్తులు తాలూకా సంఘం సభ్యులు. ఈ కార్యక్రమంలో మహనీయులను మహాత్మ గాంధీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో నమస్కరించారు. ముదిరాజ్ సంఘం జెండా ఆవిష్కరణ మత్స్య శాఖ అధ్యక్షులు శంకర్రావు, ముదిరాజ్ సంద రాములు, గ్రామ అధ్యక్షులు సంద నర్సింహులు ముదిరాజ్, సత్యనారాయణ, వెంకటేష్ సురేష్ రామచంద్రయ్య, శంకరయ్య రాజు అంజయ్య రామచంద్ర శంకరయ్య మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ముదిరాజ్ జెండా ఎగరాలని ముదిరాజులు చైతన్యవంతులు కావాలని విద్యా ఉద్యోగ ఆర్థిక సామాజిక రాజకీయ రంగాలలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బాపూజీ నగర్ లో ఘనంగా గణపతి ఉత్సవాలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్



జయభేరి, మేడిపల్లి, ఆగస్టు31 :

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాపూజీ నగర్ కాలనీలో గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్,సీనియర్ నాయకులు కాటపాక కుమార్, కాలనీ అధ్యక్షుడు బాల్దె వెంకటేష్, బండారి యాదగిరిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించి భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా సుభాష్ నాయక్ మాట్లాడుతూ కాలనీవాసులందరు భక్తితో పాటు ఐక్యమత్యాన్ని చాటడం అభినందించదగిన విషయమని అన్నారు.ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించి మమ్మల్ని ఆహ్వానించడం చాల సంతోషంగా ఉందని ఇలాగే మన సంస్కృతి సం



ప్రదాయాలను పిల్లలకు అలవాటు చేయాలని సూచించారు.కాలనీ అధ్యక్షుడు బాల్దె వెంకటేష్ మాట్లాడుతూ అయిదు రోజుల పాటు ఘనంగా పూజలు నిర్వహించి అన్నప్రసాదాలు నిర్వహించాము. ప్రతి సంవత్సరం కాలనీ వాసులందరం వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తూ పిల్లలు పెద్దలందరం కలిసి వివిద కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాలనీ ప్రదాన కార్యదర్శి రాజయ్య,కోశాదికారి కన్నె ఉపెందర్, ఉపాధ్యక్షుడు కిష్టయ్య,కాలనీ వాసులు ననుబోతు రాము యాదవ్, జూపల్లి యాదగిరి, సామల రఘు, శ్రీరాముల బాబు, కాటి ఆంజనేయులు, బండారి యాదగిరి, అనిత, జి.రమేష్, విష్ణు, నిమ్మల మల్లేష్, సయ్యద్, శ్యామల్ కుమార్, రాము నాయక్, విష్ణు యాదమ్మ, చిక్కుడు లక్ష్మీ, కన్నె మానస, నవనీత, వసంత, మౌనిక, లావణ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



మూసాపేట్ డివిజన్ భవాని నగర్ EWS లో సోదరుడు మహేష్ ఆధ్వర్యంలో, జనతా నగర్ లో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని దర్శించుకున్న మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్.

జయభేరి, మూసాపేట్



## గణేష్ నవరాత్రి వేడుకలు



జయభేరి, మెడిపల్లి :


పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్ వివిధ గణేష్ మండపాలను సందర్శించి, అన్నప్రసాదం లో పాల్గొని, వినాయక విగ్రహ శోభాయాత్రల్లో భాగస్వామ్యం అయ్యి, భక్తులతో కలిసి శ్రీ గణపతి బాప్పా ఆశీర్వాదాలు పొందారు.

ఈ ఉత్సవాల్లో ప్రముఖంగా పాల్గొన్న మాజీ కార్పొరేటర్లు నవీన్ రెడ్డి, సుబాష్ నాయక్, అనంత్ రెడ్డి, సహభాగ్య సభ్యుడు జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఈశ్వర్ రెడ్డి, పీఎంసీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రెడ్డి, మెడిపల్లి హనుమాన్ దేవాలయం చైర్మన్ రామ్ రెడ్డి, డైరెక్టర్ ప్రశాంత్, నాయకులు గణేష్, ఉదయ్, అలాగే కాలనీ వెల్ఫేర్ సంఘాలు & కమిటీలు. ఈ గణేష్ నవరాత్రి శుభ సందర్భంలో అందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఐక్యత లభించాలని శ్రీ గణపతి ఆశీర్వదించుగాక.



# MLR కాలనీ లో ఘనంగా గణపతి ఉత్సవాలు.. అన్నదాన కార్యక్రమం


















# నారా వారింట పెళ్లి సందడి..

టాలీవుడ్‌లో తనదైన శైలితో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న టాలెంటెడ్ హీరోల్లో నారా రోహిత్ ఒకరు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడి సోదరుడి కుమారుడిగా సినీ ఇండస్ట్రీకి పరిచయమైన రోహిత్, కెరీర్ ప్రారంభంలోనే బాణం, ప్రతినిధి వంటి సినిమాలతో సీరియస్ నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.అయితే కొన్ని వరుస ఫ్లాపులతో అతని కెరీర్ కాస్త డౌన్ అయ్యింది. దీంతో కొన్నేళ్లు గ్యాప్ తీసుకుని వెయిట్ & లుక్ లో భారీ మార్పులు చేసుకున్నారు. రోహిత్, తాజాగా 'సుందరకాండ' అనే సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇచ్చాడు. ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు రాగా, పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. సుదీర్ఘ విరామం తర్వాత వచ్చిన ఈ సినిమా, రోహిత్‌కి మంచి బూస్టప్‌ని అందించింది.

యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను టార్గెట్ చేస్తూ రూపొందిన ఈ చిత్రం మంచి రెస్పాన్స్‌ను రాబట్టడంతో, రోహిత్ ప్రమోషన్స్‌లో ఫుల్ జోష్‌తో పాల్గొంటున్నారు. తాజాగా గుంటూరులో జరిగిన ప్రమోషనల్ ఈవెంట్‌లో పాల్గొన్న రోహిత్, అక్కడ గణేశుడిని దర్శించుకుని అభిమానులతో, మీడియాతో మాట్లాడారు. "ఇంత కాలం తర్వాత ఆడియెన్స్ నుంచి ఇలా స్పందన రావడం ఎంతో సంతోషంగా ఉంది. ఇది నాకు నమ్మకాన్ని కలిగిస్తోంది," అని చెప్పారు.ఈ సందర్భంగా రోహిత్ తన పెళ్లి గురించి కూడా ఓ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ మొదటి వారంలో నా పెళ్లి జరుగుతుంది అని అధికారికంగా ప్రకటించారు.

ఇప్పటికే 'ప్రతినిధి 2' సినిమాలో హీరోయిన్‌గా నటించిన శిరీష (సిరి) తో రోహిత్‌కి నిశ్చితార్థం జరిగింది. అయితే, ఎప్పుడో వీరి వివాహం జరగాల్సి ఉండగా, రోహిత్ తండ్రి ఆకస్మికంగా మృతి చెందడంతో ఈ వేడుక వాయిదా పడింది. ఇప్పుడు మళ్లీ కొత్త షెడ్యూల్‌ను ఫిక్స్ చేశారని తెలుస్తోంది. సుందరకాండ తర్వాత తన తదుపరి సినిమాలు వేరే జోనర్స్, అన్ని వర్గాల ప్రేక్షకులను టార్గెట్ చేస్తూ ఉంటాయని, త్వరలోనే వాటిపై అధికారిక ప్రకటన చేస్తానని కూడా రోహిత్ తెలిపారు. మొత్తానికి, "సుందరకాండ" సినిమా నారా రోహిత్ కెరీర్‌నే కాకుండా వ్యక్తిగత జీవితాన్నీ కొత్త దిశగా తీసుకెళ్తోంది.

# డ్రాగన్‌లో మాఫియా డాన్?



ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'డ్రాగన్' (టైటిల్ ఇంకా ఖరారు కాలేదు) సినిమా నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఎన్టీఆర్‌ను మునుపెన్నడూ చూడని రీతిలో అత్యంత శక్తివంతంగా ఆవిష్కరిస్తూ దర్శకుడు ప్రశాంత్‌నీల్ స్క్రిప్ట్ రాశారని, ఆయన పాత్ర హై ఇంటెన్స్ యాక్షన్, ఎమోషన్స్‌తో సాగుతుందని చెబుతున్నారు. ఈ సినిమా గురించి తాజా అప్‌డేట్ ప్రచారంలోకి వచ్చింది. ఈ సినిమా సెకండాఫ్‌లో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ కథకు ఆయువుపట్టులా ఉంటుందట. ఈ ఎపిసోడ్‌లో ఎన్టీఆర్ పాత్ర మాఫియా నేపథ్యంలో నడుస్తుందని, ఈ సన్నివేశాలపై దర్శకుడు ప్రశాంత్‌నీల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోబోతున్నారని అంటున్నారు. ఇప్పటికే ఈ చిత్రం ముప్పై శాతానికి పైగా చిత్రీకరణ పూర్తిచేసుకుంది. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవిబస్రూర్ సంగీతాన్నందిస్తున్నారు. రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్నది.

# అదిరేటి డ్రెస్‌లో రాములమ్మ..



అందాల ముద్దుగుమ్మ యాంకర్ శ్రీముఖి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. యాంకర్‌గా రాణివ్వడమే కాకుండా, పలు సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తూ, తన అంద చందాలతో అందరి మనసు దోచేస్తుంది. పటాస్ కామెడీ షోతో తెలుగు అభిమానులకు పరిచయమైన ఈ చిన్నది, తన కామెడీ, పంచ్ డైలాగ్స్, అల్లరితో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా ఏ షోలనైనా సరే ఈ చిన్నది చేసే సందడి మాములుగా ఉండదు. లేదు. తన దైన తీరులో కామెడీ పండిస్తూ అందరినీ ఆకట్టుకుంటుంది. పటాస్‌తో ఫేమ్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ తెలుగు బిగ్గెస్ట్ రియాల్టీ షో బిగ్ బాస్‌కు వెళ్లి తన కంటూ ఓ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. తన ఆటతీరు, మాటతీరుతో ఎంతో మంది అభిమానులను కూడగట్టుకుంది. అంతే కాకుండా ఈ బ్యూటీ రన్నర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇక టాలీవుడ్ టాప్ మోస్ట్ యాంకర్లలో ఈ బ్యూటీ ఒకరు. ప్రస్తుతం వరసగా షోలు చేస్తూ బిజీ బిజీగా గడిపేస్తుంది. స్టార్ మా వరస షోలకు యాంకర్‌గా చేస్తూ తన సత్తా చాటుతుంది. అంతే కాకుండా, బిగ్ బాస్ అగ్నీ పరీక్ష కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది, స్టైలిష్ డ్రెస్‌లో తన అంద చందాలతో అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. మరి మీరు కూడా ఆఫొటోస్ పై ఓ లుక్ వేయండి.

# అలా మొదలైంది..



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తన ప్రియుడిని పరిచయం చేసింది టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ నివేదా పేతురాజ్. దుబాయ్ కు చెందిన వ్యాపారవేత్త రజిత్ ఇబ్రాన్ తో రిలేషన్ షిప్ లో ఉన్నానన్న విషయాన్ని సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. దీంతో సినీ ప్రముఖులు, అభిమానులు ఈ ముద్దుగుమ్మకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అసలు జిబ్రాన్ తో పరిచయం ఎప్పుడు మొదలైంది? ప్రేమ దాకా ఎలా వెళ్లింది? పెళ్లెప్పుడు చేసుకుంటారన్న విషయాలను లేటెస్ట్ గా ఓ ఇంటర్వ్యూలో షేర్ చేసుకుంది నివేద. 'ఐదేళ్ల క్రితం దుబాయిలో ఓ రేసింగ్ సందర్భంగా రజిత్‌తో మొదటి సారి నాకు పరిచయం జరిగింది. మొదట మంచి స్నేహితులుగానే ఉన్నాం. ఆ తరవాత ఇద్దరి అభిప్రాయాలు, మనసులు కలవడంతో ఇద్దరు ప్రేమికులమయ్యాం. మా సర్కిల్ లో చాలా తక్కువ మందికి మాత్రమే మా ప్రేమ విషయం తెలుసు. సినిమా ఇండస్ట్రీలోనూ ఎవరికీ ఈ విషయం తెలియదు. సడెన్ గా మా ప్రేమ విషయం బయట పెట్టడంతో నా మేనేజర్ తో సహా అందరూ షాక్ అ య్యారు.' రజిత్‌తో అక్టోబర్ లో నా ఎంగేజ్ మెంట్ ఉండనుంది. ఆ తర్వాత జనవరిలో పెళ్లి ఉండనుంది. అయితే డేట్ ఇంకా ఫైనలేజ్ చేయలేదు. కానీ ఇప్పటికే పెళ్లి పనులు మొదలు పెట్టేశాం. ప్రస్తుతం మా ఇద్దరి కుటుంబాలు దుబాయ్ లో ఉన్నాయి. కుటుంబ సభ్యులు, అతి కొద్ది మంది సన్నిహితుల సమక్షంలో సింపుల్ గానే మా పెళ్లి వేడుకను చేసుకుంటాం' అని నివేద చెప్పుకొచ్చింది.

## కర్ణాటక సీఎంతో రామ్ చరణ్ భేటి..

# సడెన్ మీటింగ్‌కి కారణం ఏంటి?



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో రూపొందుతోన్న 'పెద్ది' సినిమా షూటింగ్ ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్ లో శరవేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా, గత కొన్ని రోజులుగా చిత్రబృందం సినిమా టైటిల్ సాంగ్‌కి సంబంధించిన భాగాలను చిత్రీకరిస్తోంది.అయితే శనివారం, అల్లు కనక రత్నమ్మ మరణంతో చిత్ర యూనిట్ తాత్కాలికంగా షూటింగ్‌కు విరామం ఇచ్చింది. చివరి చూపు కోసం రామ్ చరణ్ హుటాహుటిన హైదరాబాద్ వెళ్లి, తన అమ్మమ్మకు ఘనంగా నివాళులర్పించి తిరిగి అదే రోజున మైసూర్‌కి వెళ్లిపోయారు.ఇక ఆదివారం, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆహ్వానంతో రామ్ చరణ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో చరణ్.. సిద్ధరామయ్యకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా సీఎం కూడా రామ్ చరణ్‌కి ఆత్మీయ స్వాగతం పలికారు.

ఇక సిద్ధరామయ్య 'పెద్ది' సినిమా గురించి ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైసూర్‌లో చిత్రీకరణ జరుపుకుంటోన్న విషయమై కూడా మాట్లాడినట్టు సమాచారం. రామ్ చరణ్ – సిద్ధరామయ్య కలిసి దిగిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

అభిమానులు, నెటిజన్లు ఈ భేటీపై స్పందిస్తూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. మర్యాద పూర్వకంగా ఈ భేటి జరిగినట్టు తెలుస్తుంది. ప్రస్తుతం కర్ణాటక ముఖ్య మంత్రితో రామ్ చరణ్ దిగిన ఫొటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. ఇక జానీ మాస్టర్ సినిమాకి సంబంధించిన పాటని కొరియోగ్రఫీ చేస్తుండగా, ఇందులో సుమారు 1000 మందికి పైగా డాన్సర్లు పాల్గొంటున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో డాన్సర్లతో ఈ సాంగ్‌ని చిత్రీకరిస్తుండడం విశేషం.

ఈ పాట "విజువల్ ఫీస్ట్" అవుతుందని అంటున్నారు. ఈ సినిమాకోసం రాంచరణ్ స్పెషల్ లుక్ ట్రై చేశారు. పొడవాటి జుట్టు, గుబురు గడ్డం, ముక్కుపుడకతో పక్కా రఫ్ అండ్ రస్టిక్ లుక్‌లో రామ్ చరణ్ కనిపించి సందడి చేయనున్నారు. ఇక చరణ్‌కు జోడీగా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ నటిస్తోంది. అలాగే శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించి సందడి చేయనున్నారు. కెమెరామెన్‌గా రంగస్థలం ఫేమ్ రత్నవేలు పనిచేస్తుండగా.. ఎడిటింగ్ బాధ్యతలు జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి తీసుకున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889**. **RNI No: TGTEL/25/A0314**. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com